క్లుప్తంగా

సకాలంలో ఇద్దరే హాజరు



11 గంటలకు సమావేశంలో ఉన్న ఇద్దరు కార్పొరేటర్లు

ఏలూరు (టూటౌన్): ఏలూరు కార్పొరేషన్‌లో బడ్జెట్ సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు అధికారులు అందరికీ అజెండా కాపీ పంపించారు. అయితే సమయం 11 గంటలు కావస్తున్నా ఇద్దరు మహిళా కార్పొరేటర్లు మాత్రమే హాజరయ్యారు. సమావేశం గంటల ఆలస్యంగా ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైంది. అధికారులు మాత్రం 10.30 గంటలకే వచ్చి ఉన్నారు.

సమీక్షా సమావేశం

ఏలూరు(మెట్రో): గ్రామీణాభివృద్ధి పనులపై జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ బుధవారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం, సీసీ రోడ్లు, ఫారంపాండ్‌లు, పశుషెడ్ల నిర్మాణాలు, ఉపాధి కల్పన (మన్‌డేస్) అంశాలపై సమీక్షించారు. జెడ్పీ సీఈఓ కె.భీమేశ్వర్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల డ్వామా పీడీ, డీఆర్‌డీఏ పీడీ, హౌసింగ్ ఈఈ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి ఏలూరుకు చెందిన భక్తులు బుధవారం రూ.1.63 లక్షల విరాళం సమర్పించారు. ఏలూరులోని తంగెళ్లమూడికి చెందిన శీర కనకమహాలక్ష్మి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేసింది. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,63,400 విరాళం అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం, అనంతరం దాతలకు ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

పాము కాటుతో మహిళ మృతి

ఏలూరు టౌన్: మొక్కజొన్న పొత్తుల విరిచే పనికి వెళ్లిన మహిళ పాము కాటుకు గురైంది. హాస్పిటల్‌కు తరలించేలోపు మృతి చెందింది. లింగపాలెం మండలం వేములపల్లి గ్రామానికి చెందిన ఉప్పులూరి లక్ష్మి (48) భర్త నగేష్, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బుధవారం ఉదయం కామవరపుకోట మండలం కళ్లచెరువు సమీపంలో కంద్రికగూడెంలో మొక్కజొన్న పొత్తులను విరిచే పనికి వెళ్లింది. పనిలో ఉండగా పాము కాటు వేయటంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను వెంటనే సహచర కూలీలు ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. హాస్పిటల్ అత్యవసర వైద్యసేవల విభాగంలో వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతిచెందినట్టు నిర్ధారించారు. వైద్యులు మెడికో లీగల్ కేసుగా నమోదు చేసి హాస్పిటల్ ప్రాంగణంలోని పోలీస్ అవుట్‌పోస్టుకు సమాచారం అందించారు.

ఇరుకు వంతెనపై ఇక్కట్లు

- ప్రమాదకరంగా తూర్పు లాకుల వద్ద వంతెన
- దెబ్బతిన్న వంతెన రెయిలింగ్‌లు
- కోతకు గురవుతున్న రోడ్డు



ఈజీకే రహదారిలో తూర్పులాకుల వద్ద దెబ్బతిన్న వంతెన



వంతెనను ఆనుకుని కోతకు గురవుతున్న తారు రోడ్డు

ఏలూరు (టూటౌన్): అసలే ఇరుకు వంతెన, ఆపైన ఇరువైపులా దెబ్బతిన్న రెయిలింగ్స్, పెరిగిన ట్రాఫిక్ వెరసి ప్రమాదాలకు నెలవుగా మారాయి. ఎన్ని సార్లు ప్రమాదాలు సంభవించినా అధికారుల నుంచి స్పందన కరువైందని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఏలూరు – గుండుగొలను – కొవ్వూరు (ఈజీకే) రహదారిలో ఏలూరు తూర్పు లాకుల సమీపంలో ఇటు బైపాస్ రోడ్డు, అటు ఏలూరు, దెందులూరు మండలాల గ్రామాలను కలుపుతూ గతంలో నాటి ప్రజల అవసరాలకు అనుగుణంగా వంతెన నిర్మించారు. ప్రస్తుతం ఈ వంతెనపై ఎదురెదురుగా వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. వంతెన ఇరుకుగా ఉండడంతో ఒక వాహనం వెళ్లిన తర్వాతే మరో వాహనం రావాల్సి ఉంది. దీనికితోడు వంతెనకు ఇరువైపులా రెయిలింగ్స్ పాడైపోవడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనను వెడల్పు చేసి, రెయిలింగ్‌లను బాగు చేయించి ప్రమాదాల నివారించాలని వాహనచోదకులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

నిత్యం రద్దీ

ఏలూరు తూర్పు లాకుల నుంచి దెందులూరు మండలం పోతునూరు వరకు, ఆపై భీమడోలు మండలం లంక గ్రామాలకు ఈ వంతెన పైనుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో పండే వ్యవసాయ, ఆక్వా పంటలను లారీలు, ట్రాక్టర్లలో తరలిస్తుంటారు. ఈ మార్గంలోనే కొమడవోలు, పాలగూడెం, కొవ్వలి, పోతునూరు గ్రామాల పరిధిలోనే 100కు పైగా ప్రయాణికులు ఆటోలపై రాకపోకలుసాగిస్తారు. ఈ ప్రాంతాల్లో ఉన్న రైస్ మిల్లులు నుంచి లెవీ బియ్యాన్ని ఏలూరు గూడ్స్ షెడ్‌కు తోలుతుంటారు. ఇలా.. ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. తూర్పు లాకుల వద్ద వంతెన ఇరుకుగా ఉండటంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడంలేదు.

తరచుగా ప్రమాదాలు

ఏలూరు తూర్పులాకుల వద్ద ఉన్న ఇరుకు వంతెనపై తరచు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. గతంలో దెందులూరు మండలం ఉండ్రాజవరం గ్రామానికి చెందిన వ్యక్తి ఈ వంతెనపై నుంచి రాత్రి వేళ కాలువలోకి జారి పడి మృతి చెందాడు. వంతెన రెయిలింగ్ కూలిపోవడం, వంతెనకు, రోడ్డుకు మధ్య ఖాళీ ఉండటంతో ద్విచక్ర వాహనచోదకుడు నేరుగా లాకుల్లోకి దూసుకు పోయాడు. ద్విచక్ర వాహనం 12 అడుగుల లోతు నీటిలో పడిపోయి ఎందుకు పనిరాకుండా పోయింది. ఇలా అనేక ఘటనలు ఈ ప్రాంతంలో జరిగాయి.

కోతకు గురవుతున్న రోడ్డు

ఈజీకే రహదారిలోని వంతెనను ఆనుకుని ఉన్న తారురోడ్డు కోతకు గురవుతోంది. రాత్రి వేళల్లో వాహనచోదకులు గోతిలో పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. కోతకు గురవుతున్న ప్రాంతంలో రోడ్డు వద్ద నివారణ చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

రెయిలింగ్‌లను బాగు చేయాలి



వంతెన రెయిలింగ్‌లను తక్షణం బాగు చేయాలి. రాత్రి వేళల్లో వంతెన పూర్తిగా కన్పించే విధంగా ఈ ప్రాంతంలో విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయాలి. ఒకటి రెండు ఉన్నా అవి పూర్తి స్థాయిలో వెలుగును ఇవ్వడం లేదు.

– వెంపా నాగరాజు, పాలగూడెం, ఏలూరు రూరల్ మండలం

వంతెన వెడల్పు చేయాలి



ఎప్పుడో వందేళ్ల క్రితం ఉన్న జనాభాకు అనుగుణంగా వంతెనను నిర్మించారు. నేటి జనాభాకు, వాహనాల రద్దీకి అనుగుణంగా వంతెనను వెడల్పు చేయాలి. రోడ్డు కోతకు గురి కాకుండా రక్షణ చర్యలు చేపట్టాలి.

– గారపాటి నాగేశ్వరరావు, మాదేపల్లి, ఏలూరు రూరల్ మండలం

కాంటూర్ కుదింపు హామీ నెరవేర్చాలి

ఏలూరు (టూటౌన్): కొల్లేరును ఐదు నుంచి మూడో కాంటూరుకు కుదిస్తామని ప్రభుత్వం హామీ అమలు కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీల్లో కొల్లేరు ప్రాంతంలో యాత్ర నిర్వహించనున్నట్టు ఆ పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారం కోసం రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో కొల్లేరు ప్రజలకు హామీలు ఇవ్వడం వాటిని మర్చిపోవడం సర్వసాధారణంగా మారిందని ఆయన విమర్శించారు. యాత్రలో కొల్లేరు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రవి విజ్ఞప్తి చేశారు.

అంజలికి న్యాయం చేయాలి

రాజమండ్రి కిమ్స్ బొలినేని ఆసుపత్రిలో పనిచేస్తున్న అంజలి అనే ఫార్మాసిస్టు దీపక్ అనే సూపర్‌వైజర్ వేధింపులు తట్టుకోలేక సూసైడ్‌కు ప్రయత్నించిన ఘటనపై తక్షణం విచారణ చేయించాలని రవి డిమాండ్ చేశారు. అంజలికి న్యాయం చేయాలి కోరారు. వేధింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు ఏలూరు వైస్ ఎంపీపీ ఎన్నిక

దెందులూరు: ఏలూరు మండలం వైస్ ఎంపీపీ ఎన్నిక గురువారం ఉదయం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఏలూరు ఎంపీడీఓ శ్రీలత తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు అందరూ విధిగా హాజరు కావాలని కోరారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్ దేవకీ దేవి, విజిలెన్స్, సివిల్ సప్లయ్స్, ప్రీసైడింగ్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఎన్నిక జరుగుతుందని పేర్కొన్నారు.

ఎల్‌ఈడీ లైట్లు, లౌడ్ హారన్ల తొలగింపు



ఆటో ఎల్‌ఈడీ లైట్లను తొలగిస్తున్న అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్ ఆదేశాల మేరకు వాహన తనిఖీ అధికారులు బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. 45కు పైగా ఆటోలు, తేలికపాటి సరుకు రవాణా వాహనాలకు అమర్చిన ఎల్‌ఈడీ లైట్లు, లౌడ్ హారన్లు, లౌడ్ స్పీకర్ల కనెక్షన్లను తొలగించారు. ఈ తనిఖీల్లో వాహన తనిఖీ అధికారులు పి.రమేష్ బాబు, ఎస్ జగదీష్ బాబు పాల్గొన్నారు. ఆటోలు, ఇతర వాహనాలకు అదనంగా ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్లు, లౌడ్ హారన్లు, లౌడ్ స్పీకర్లను తొలగించక పోతే కేసులు నమోదు చేస్తామని డీటీసీ కరీమ్ హెచ్చరించారు. గత రెండు వారాలలో 165 వాహనాల నుంచి అదనపు లైట్లు, లౌడ్ హారన్లను తొలగించినట్టు చెప్పారు. ఎల్‌ఈడీ లైట్ల వల్ల ఎదురుగా వచ్చే వాహనచోదకులకు ఇబ్బంది ఏర్పడుతుందని, లౌడ్‌స్పీకర్ల నుంచి వెలువడే అధిక ధ్వని ప్రయాణికులను అసౌకర్యానికి గురిచేస్తాయని డీటీసీ వివరించారు. రహదారి భద్రతా నియమాలను ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

వైభవంగా జాతర మహోత్సవాలు



వీరభద్ర రావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కొత్తపేట నూకాలమ్మ 45వ జాతర మహోత్సవాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక భక్తులు అమ్మవారికి చద్ది, వేడి నైవేద్యాలు సమర్పించి, కుంకుమ పూజలు చేశారు. అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. బుధవారం రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు జల్లా వీరభద్ర రావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర నిమిత్తం కమిటీ ప్రతినిధులకు రూ.20 వేలు అందజేశారు. అర్చకులు మంత్రవాది రామకృష్ణ యోగానంద శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిరోజు సాయంత్రం మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ నగర వీధుల్లో ఘటాల ఊరేగింపు మహిళలచే వైభవంగా నిర్వహిస్తున్నారు.

యువతి అదృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు టూటౌన్ ప్రాంతంలోని సబ్బవరపు వారివీధికి చెందిన ఒక యువతి (19) అదృశ్యమైంది. పదో తరగతి చదివి ఇంటివద్ద ఉంటోన్న యువతి ఈనెల 24న ఇంటి నుంచి బయట కెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జెడ్పీ చైర్మన్‌ను కలిసిన ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

ఏలూరు(మెట్రో): ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్‌డీసీ ఎం ముక్కంటి బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు. ముక్కంటికి పద్మశ్రీ అభినందనలు తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై చర్చించారు.

క్షయపై అవగాహన అవసరం

భీమడోలు: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎయిడ్స్, క్షయ నివారణాధికారి ఎం నాగేశ్వరరావు అన్నారు. పూళ్ల పీహెచ్‌సీలో బుధవారం జాతీయ ఎయిడ్స్, టీబీ నియంత్రణ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంచార వాహనం వద్ద పలు రకాల నిర్ధారణ పరీక్షలు చేశారు. వ్యాధి విస్తరణ, నిర్ధారణ వంటి అంశాలపై క్షేత్ర సహాయ సిబ్బందికి అవగాహన కల్పించారు. వ్యాధుల లక్షణాలను వివరించారు. వైద్యులు సూచించిన మందులనే వాడాలన్నారు. ఈ మేరకు తొలుత కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి పి.అరుణజ్యోతి, సూపర్‌వైజర్లు కిషోర్, శ్రీనివాస్, ప్రాజెక్టు మేనేజర్ కె.శిరీషా, కౌన్సలర్ సురేష్, హనుమంతు, ఫీల్డ్ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సురక్షిత నీటిని సరఫరా చేయండి

ఉంగుటూరు: ప్రజలకు సురక్షితమైన నీటిని సరఫరా చేయాలని జెడ్పీ సీఈఓ భీమేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన ఉంగుటూరు మంచినీటి ప్రాజెక్టును సందర్శించారు. ఈ ప్రాజెక్టు పనితీరును అడిగి తెలుసుకున్నారు. డెల్టా గ్రామాల ప్రజలకు మంచినీరు సరఫరా చేయాలని సూచించారు. నాచుగుంట వాటర్ ప్రాజెక్టులో సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. సదుపాయాలపై ఆరా తీశారు. ఆర్‌డబ్ల్యూ ఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ జానీ, ఎంపీడీఓ రాజ్ మనోజు ఉన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	38	బీన్సదిక్కుడు	88
వంకాయలు (తెలుపు)	34	చామదుంపలు	48
బెండకాయలు	34	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	76
కాకర కాయలు	36-40	బీట్‌రూట్	30
బీరకాయలు	34	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	16	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	30	పాలకూర	10
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	30	చుక్కకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	24-34	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	50
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	24
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	31
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	రద్దు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

ప్రజా సమస్యలపై ధర్నా



కార్పొరేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

ఏలూరు (టూటౌన్): ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం ఏలూరు నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. గత పది రోజులుగా ప్రజా చైతన్య యాత్ర పేరుతో నగరంలో వివిధ ప్రాంతాలు కమిటీ పర్యటించింది. ప్రజా సమస్యలను పరిశీలించింది. ఈ సమస్యలపై మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీపీఎం నగర కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలవుతున్నా ప్రజా సమస్యలు పరిష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణం పూర్తి చేసుకున్న దాదాపు 6000 టిడ్కో ఇళ్లను వెంటనే లబ్ధిదారుల కేటాయించాలని డిమాండ్ చేశారు. అర్హులయిన వారందరికీ వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్‌లు అందజేయాలని కోరారు. జూట్ మిల్లులు మూతపడి ఉపాధి అవకాశాలు లేవని, అర్హులకు వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని అన్నారు. సుందరయ్య కాలనీ, కుమ్మరి రేవులలో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. వెంకటాపురం పంచాయతీ పరిధిలో గోదావరి జలాలు సరఫరా చేయాలని కోరారు. కుమ్మరి రేవు ఏటిగట్టు ప్రాంతానికి డ్రిల్ బోర్ ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా 50 ఏళ్లు నిండిన ఎస్సీ, బీసీలకు పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలన్నారు. తంగెళ్లమూడి ప్రాంతంలో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ఎస్టీపీ ప్లాంట్లను వినియోగంలోకి తేవాలని కోరారు. ధర్నాలో నాయకులు వైఎస్ కనకారావు, కె.రామాంజనేయులు, వీవీఎస్ ప్రసాద్, గొట్టాపు రవికిషోర్,కంది విశ్వనాధం, ఎం.ఇసాక్, బి.సోమయ్య, జై.గోపి, కె.విజయలక్ష్మి, జి.ఏసుబాబు, మీసాల సత్యనారాయణ, ఎస్ సత్యనారాయణ, గనిగంటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ లబ్ధిదారుల్లో టెన్షన్

- కొనసాగుతున్న పింఛన్ల పునఃపరిశీలన
- సీహెచ్‌సీకి వచ్చేందుకు ఇబ్బందులు



భీమడోలు సీహెచ్‌సీకి వచ్చిన పింఛనుదారులు



తన భార్య శ్రీదేవిని ఎత్తుకుని తీసుకొస్తున్న జగన్

భీమడోలు: పింఛన్ల పునఃపరిశీలన కార్యక్రమం కొనసాగుతోంది. తమ పింఛన్లు ఎక్కడ తొలగిస్తారోనని లబ్ధిదారులతో టెన్షన్ మొదలైంది. రూ.6 వేలు అందుకుంటున్న ఎముకల సంబంధిత దివ్యాంగ లబ్ధిదారుల వైకల్యాన్ని గుర్తించేందుకు ప్రభుత్వం సంబంధిత వైద్యులతో పునఃపరిశీలన కార్యక్రమాన్ని చేపట్టింది. సదరం ధ్రువీకరణ పత్రాలు సరైనవోకావో పరిశీలిస్తున్నారు. భీమడోలు మండల వ్యాప్తంగా 1,180 మంది దివ్యాంగ పింఛన్లు అందుకుంటున్నారు. భీమడోలు, గుండుగొలను, కోడూరుపాడు, దుద్దేపూడి సచివాలయాల పరిధిలోని 123 మంది దివ్యాంగులకు భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం నిర్వహించే వైద్య పరీక్షలకు హాజరు కావాలని సచివాలయాల ఉద్యోగుల నుంచి సమాచారం పంపారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసాలను ఓర్చి వారిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకొచ్చారు. వీరిలో కొందరు పుట్టుకతో పోలియో కారణంగా మంచానికే పరిమితమయ్యారు. వీరిని ఆసుపత్రికి తీసుకొచ్చేందుకు కుటుంబీకులు ఇబ్బందులు పడ్డారు. బాధితుల వద్దకే వైద్యులు వస్తే ఇబ్బందులు ఉండవని వారు పేర్కొంటున్నారు. ఎండల వేళ ఉదయం నుంచి సాయంత్రం వరకు పరీక్షల కోసం గంటల కొద్దీ లబ్ధిదారులు పడిగాపులు పడ్డారు. వీరికి మంచినీటి మినహా ఎటువంటి సదుపాయాలు కల్పించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కూడా ఆసుపత్రి వద్ద దివ్యాంగులకు పరీక్షలు చేస్తారని, మండలంలోని ప్రతి దివ్యాంగ పింఛన్‌దారులకూ పరీక్షలు చేస్తారని అధికారులు తెలిపారు. పరీక్షల తర్వాత నివేదికలను డీఎంహెచ్‌ఓవోలకు అందజేస్తారని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి తెలిపారు.

యంత్రాలు, ఉత్పత్తులపై అవగాహన కల్పించాలి



బీసీ కార్పొరేషన్ ఈడీతో సమావేశమైన సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): ఆదరణ పథకంలో ఆధునిక యంత్రాలు, ఉత్పత్తులపై అవగాహన కల్పించాలని విశ్వబ్రాహ్మణ వృత్తి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బుధవారం బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్ పుష్పలతను విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార, కార్పెంటర్ సంఘాల నాయకులు కలిశారు. స్వర్ణకారులకు ఆదరణ పథకం ప్రయోజనాలు అందేలా చూడాలని, యూనిట్ కాస్ట్ రూ.10 లక్షల వరకు పెంచాలని కోరారు. కార్పెంటర్స్‌కు సంభంధించి పవర్ టూల్స్ తోపాటు ఎలక్ట్రానిక్ బ్యాటరితో పనిచేసే టూల్స్ సప్లయి చేయాలన్నారు. ప్రభుత్వ భవన, ఇతర నిర్మాణాల్లో ఫర్నిచర్ వర్క్ ఆర్డర్లు ఇచ్చి కార్పెంటర్లకు పని కల్పించాలని కోరారు. శివశ్రీ మాట్లాడుతూ ఆధునిక యంత్రాలు, ఉత్పత్తులలో మోడ్రన్ ఉత్పత్తులు చోటుచేసుకుంటున్నాయని, ఈనూతన ఉత్పత్తులు ఆధునిక యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించే విధంగా ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేయాలని అన్నారు.

వరద బాధితులకు న్యాయం చేయాలి

దెందులూరు: విజయవాడ వరద బాధితులకు అందించాల్సిన లక్షలాది రూపాయల బియ్యాన్ని గోపాలపురం నియోజకవర్గం జనసేన నేత సువర్ణరాజు కైంకర్యం చేయటం దుర్మార్గమని, వెంటనే ఉపముఖ్యమంత్రి విచారణకు ఆదేశించాలని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు డిమాండ్ చేశారు. బుధవారం దెందులూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. వరద బాధితు బాధితుల సాయాన్ని దోచుకోవడం సిగ్గుచేటన్నారు. బాధితులకు నాయం చేయాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలను అరికడదాం

భీమడోలు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఈ విషయంలో తల్లిదండ్రులను అవగాహన కల్పించాలని పూళ్ల వైద్యాధికారిణి పి.అరుణజ్యోతి అన్నారు. పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల, పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో బుధవారం చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్యంలో బాల్య వివాహ నిరోధక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. భీమడోలులో క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్.వినోద్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ అరుణజ్యోతి మాట్లాడారు. బాల్య వివాహాల నియంత్రణలో గ్రామస్థాయి నిరోధక కమిటీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. బాల్య వివాహాల వల్ల చిన్న వయస్సులోనే గర్భం దాల్చడం ద్వారా అనేక శరీరక, మానసిక రుగ్మతలకు గురై తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడతారని చెప్పారు. సూపర్‌వైజర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ 18 ఏళ్లలోపు వారికి వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని, బాల్య వివాహాలు ప్రోత్సహించినా, చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాల్య వివాహాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1098కు సమాచారం అందించాలని కోరారు. జిల్లా కోఆర్డినేటర్ వినోద్‌కుమార్ మాట్లాడారు.